క్లుప్తంగా

బగలాముఖీ ఆలయ వార్షికోత్సవాలకు ఏర్పాట్లు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠం ఆలయ మొదటి వార్షికోత్సవాల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు బగలాముఖీ ఉపసాకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, పూరోహితుడు శాస్త్రుల పురుషోత్తమశర్మ తెలిపారు.

డీఎస్పీని కలిసిన ప్రజాప్రతినిధులు



డీఎస్పీని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

శివ్వంపేట(నర్సాపూర్): తూప్రాన్ డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకట్‌రెడ్డిని మంగళవారం మండల ప్రజాప్రతినిధులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండారి గంగాధర్, తదితరులు తెలిపారు.

విజయ సంకల్ప యాత్రపై కార్యకర్తలకు అవగాహన



మాట్లాడుతున్న బీజేపీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్

అల్లాదుర్గం(మెదక్): దేశానికి మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి కావడం తథ్యమని బీజేపీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఫిబ్రవరి 27న జోగిపేటలో విజయ సంకల్ప యాత్ర బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం అల్లాదుర్గంలో కార్యకర్తల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంకల్ప యాత్ర విజయవంతానికి బీజేపీ కార్యకర్తలు, నాయకులు తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అందోల్ కో కన్వీనర్ రాములు, మండలాధ్యక్షుడు యాదగిరి, మండల కార్యదర్శి సాయగౌడ్, బీజేవైఎం అల్లాదుర్గం పట్టణాధ్యక్షుడు రమేశ్, శ్రీనివాస్ భూమయ్య, నర్సింలు చారి తదితరులు పాల్గొన్నారు.

తండాలో నీటి సమస్య

చిన్నశంకరంపేట(మెదక్): తండాలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని నార్సింగి మండలంలోని నర్సంపల్లి పెద్దతండావాసులు తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి షేక్ కరీంను కోరారు. మంగళవారం నర్సంపల్లి పెద్దతండాలో తహసీల్దార్ షేక్ కరీం పర్యటించి గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో బోరుమోటార్ పాడైపోవడంతో నీటి సమస్యతో నర్సరీ మొక్కలకు నీటి సరఫరా చేయలేకపోతున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా కూడా సక్రమంగా జరగడంలేదన్నారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ బోరుమోటార్ రిపేర్ చేయించాలని గ్రామ కార్యదర్శి బాలుకు సూచించారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

పాపన్నపేట(మెదక్): స్నేహితుడి నిశ్చితార్థానికి వెళ్లి ప్రమాదంలో మరణించిన ముగ్గురు మిత్రుల అంత్యక్రియలు ఆప్తుల అశ్రునయనాల మధ్య మంగళవారం బాచారం గ్రామంలో జరిగాయి. గడ్డం ప్రభాకర్, గడ్డం భీమయ్య, శ్రీకాంత్‌లు శవాలుగా మారి ఊరికి రావడంతో ఒక్క సారిగా పల్లె గొల్లుమంది. సోమవారం రాత్రి దుర్వార్త తెలిసినప్పటి నుంచి ఊరంతా నిద్దురపోలేదు. యువకుల జ్ఞాపకాలను నెమరు వేసుకుంటు కంటతడి పెట్టారు. ప్రభాకర్ అంత్యకియలు సీతానగర్‌లో, మిగతా ఇద్దరి అంత్యక్రియలు బాచారంలో జరిగాయి. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి వేర్వేరుగా పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

అమ్మాయి ప్రేమించడం లేదని

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

తూప్రాన్: అమ్మాయి ప్రేమించడం లేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. బీహర్ రాష్ట్రానికి చెందిన ముస్తాకిన్(18) తూప్రాన్ పట్టణ కేంద్రంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. కానీ ఆమె ప్రేమించడం లేదని మనస్తాపం చెందేవాడు. దీంతో మంగళవారం ఇంట్లో బాత్‌రూమ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బావా పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎత్తిపోతలతో పచ్చదనం



ఎత్తిపోతల కింద సాగవుతున్న వరి పంట

- సాగుకు సమృద్ధిగా నీరు
- రైతుల సమష్టి కృషితో ముందుకు

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలం అంటేనే వరి పంట సాగుకు పెట్టింది పేరు. 70 శాతానికి పైగా బోర్లపై ఆధారపడి వ్యవసాయం సాగవుతుండగా, మరోవైపు మండలంలో 18 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మంజీరా నదీ రైతులకు సాగు నీరు అందిస్తుంది. ఇటీవల మంజీర నదిపై మూడు చోట్ల చెక్ డ్యాములు నిర్మించగా, ఐదు ఎత్తిపోతల పథకాలు సైతం నిర్మించడం ద్వారా పంట సాగుకు అవసరమైన నీటిని రైతులు ఎత్తిపోస్తూ పంటలను సాగు చేస్తున్నారు. పూర్తి నీటి ఆధారిత పంటల సాగువైపు మొగ్గు చూపే మండల రైతులు వరి పంటకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. సింగూర్ ప్రాజెక్టు నుంచి వనదుర్గ ప్రాజెక్టుకు వచ్చే నీటిని ఎత్తిపోతల ద్వారా పంటలకు మళ్లీస్తున్నారు. మంజీరాపై చాలా చోట్ల ఎత్తిపోతల పథకాలు ఉన్నా, అందులో మండలంలోని చిన్నఘనాపూర్ గ్రామానికి చెందిన రైతులు 20 ఏళ్లుగా వరి పంటను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఎత్తిపోతల పథకాల నిర్వహణ..

మండలంలో మొదటిసారిగా చిన్నఘనాపూర్ సమీపంలోని మంజీరా నదిపై 20 ఏళ్ల క్రితమే రెండు ఎత్తిపోతల పథకాలను నీటిపారుదల శాఖ ద్వారా ఏర్పాటు చేశారు. వీటికి ఒకటో నంబర్, రెండో నంబర్‌గా నామకరణం చేసి వాటి నిర్వహణ బాధ్యతను రైతులే కొనసాగిస్తున్నారు. వీరికి తోడుగా నీటిపారుదల శాఖ అధికారులు తమ వంతు సహకారం అందిస్తూ రైతుల సహకారంతో కొత్త మోటార్లను సమకూరుస్తూ, ఎత్తిపోతలకు అవసరమైన 24 గంటల కరెంట్ సైతం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. ప్రస్తుతం 1వ, 2వ ఎత్తిపోతల పథకాల కింద ప్రత్యక్షంగా 360 ఎకరాల సాగునీరు అందుతోంది.

సాగుకు ధోకా లేదు



నదిలో నీళ్లు ఉంటే ఎత్తిపోతల పథకాల ద్వారా నీటికి ధోకా లేదు. రెండు పంటలు పండించొచ్చు. రైతులందరూ కలిసి 20 ఏళ్లుగా ఎత్తిపోతల పథకాల ద్వారా పంటలను సాగు చేస్తున్నాం. మాకు అధికారులు కూడా సహకారం అందిస్తున్నారు.

– లక్ష్మీపతి, రైతు

కొత్త పైప్‌లైన్ అవసరం



ప్రస్తుతం ఎత్తిపోతల పథకాలు సజావుగానే సాగుతున్నాయి. సమష్టి కృషితో ముందుకు సాగుతున్నాం. ఇదే పరిస్థితుల్లో నీటిని పంటలకు అందించేందుకు కొత్తగా పైప్‌లైన్ అవసరం ఉంది. ప్రభుత్వం ఈ విషయంలో సహకరించి పైప్‌లైన్ ఏర్పాటుకు కృషి చేయాలి.

– రమేశ్, ఎత్తిపోతల చైర్మన్

ఇసుక, మట్టికి ఆన్‌లైన్‌లో అనుమతి

- దరఖాస్తులు చేసుకోవాలి
- తహసీల్దార్ శ్రీనివాస్

మెదక్: ఇసుక, మట్టి అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అక్రమ ఇసుక, మట్టి తరలింపుపై కఠిన తీసుకుంటుందని అన్నారు. అయితే ఇంటి నిర్మాణానికి ప్రజల నుంచి ఇసుక, మట్టి కోసం విజ్ఞప్తులు వస్తున్నట్టు చెప్పారు. ఇంటి నిర్మాణానికి ఇసుక అవసరం ఉన్న వారు మైనింగ్ శాఖ వెబ్‌సైట్‌లో గ్రామ పంచాయతీ నుంచి ఇంటి నిర్మాణానికి తీసుకున్న అనుమతి పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తును పరిశీలించి వారికి ఇసుక కోసం దగ్గరలో ఉన్న ప్రాంతంలో అనుమతి ఇస్తామన్నారు. అలాగే మట్టి అవసరం ఉన్న వారు కూడా పట్టా భూమితో పాటు, ఎక్కడ నుంచి మట్టి తరలిస్తారు అనే వివరాలతో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతులు నుంచి ఇస్తామని తెలిపారు. అక్రమంగా ఎక్కడ ఇసుక దందా సాగిన సమాచారం ఇవ్వాలని అన్నారు. ఇసుక కొరతపై ఆందోళన అవసరం లేదన్నారు.

నేరాలు చేస్తే చట్టరీత్యా చర్యలు

డీఎస్పీ వెంకట్‌రెడ్డి



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ

తూప్రాన్: పట్టణ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన 50 మంది రౌడీషీటర్లకు డీఎస్పీ వెంకట్‌రెడ్డి మంగళవారం డీఎస్పీ కార్యాలయం వద్ద కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేర చరిత్ర కల్గిన ప్రతీ ఒక్కరూ సత్ప్రవర్తనతో ఉండాలని సూచించారు. ఇతర నేరాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ రౌడీ షీటర్‌పై పోలీసు నిఘా ఉంటుందన్నారు. ఇందుకోసం అందరితో కలిసిమెలిసి ఉండడంతో పాటు మంచి ప్రవర్తన కలిగినవారికి రౌడీ షీట్ లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణ, ఎస్ఐ శివానందం, మనోహబాద్ వెల్దుర్తి, శివ్వంపేట ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థుల ధర్నా



రామాయంపేటలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

రామాయంపేట(మెదక్): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కళాశాల నుంచి ఊరేగింపుగా కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను విడుదల చేయకపోవడంతో వేలాది మంది నిరుపేద విద్యార్థులు ఇబ్బందులపాలవుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందన్నారు. ఆందోళనలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలతో ఉజ్వల భవిష్యత్



పాపన్నపేట(మెదక్): కళాశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



వెల్దుర్తి(తూప్రాన్): నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పాపన్నపేట(మెదక్): ఉత్తమ ఫలితాలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పాపన్నపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు అన్నారు. సోమవారం ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. లెక్చరర్లు భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, రమేశ్, సంధ్యారాణి, అరుణ, విజయ్, రాములు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండల కేంద్రం వెల్దుర్తి కేజీబీవీ పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు నాటికలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎస్ఓ పాతిమా, పీఈటీ కమల, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామాయంపేటలో పట్టపగలే దోపిడీ

రామాయంపేట(మెదక్): పట్టణంలో మంగళవారం పట్టపగలే దుండగులు రెచ్చిపోయారు. ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 5.30 లక్షలు చోరీ చేశారు. చేగుంట మండలంలోని బోనాల కొండాపూర్ గ్రామానికి చెందిన గందం చంద్రయ్య పట్టణంలో మంజీరా స్కూల్ ఎదురుగా ఉంటున్నాడు. తన భార్యను బస్సు ఎక్కించడానికి బస్టాండ్‌కు వెళ్లి, వచ్చి చూడగా..అప్పటికే తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో దాచిన రూ. 5.30 లక్షలను దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ వెంకటేశ్, ఎస్ఐ రంజిత్ బాధితుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీం సంఘటన స్థలంలో దుండగులకు సంబంధించి ఆనవాళ్లు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ముగిసిన మల్లన్న ఉత్సవాలు



నాయకులను సన్మానిస్తున్న నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో మల్లికార్జున స్వామి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఇందులో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, బండ్లు, బోనాల ఊరేగింపు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మల్లన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా యాదవ సంఘం నేతలు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవ చేస్తా

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



చెన్నాయిపల్లిలో డిపాజిట్ బాండ్లు అందిస్తున్న హన్మంతరావు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవ చేస్తానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రావుపల్లి, చెన్నాయిపల్లి గ్రామాల్లో ఎంఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని చిన్నారుల పేరిట డిపాజిట్ చేసిన బాండ్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందిస్తానన్నారు. గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు పండరిగౌడ్, అరుణప్రభాకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ నరేందర్, మాజీ సర్పంచ్‌లు రంగారావు, శ్రీమాన్‌రెడ్డి, రాజిరెడ్డి, యాదవరావు, కాంగ్రెస్ నాయకులు రామ్‌చంద్రం, గణేశ్, మనోజ్, సుధాకర్, రమేశ్‌గౌడ్, నాగరాజు, సిద్ధిరాములు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా భగీరథ కట్‌వాల్స్



ప్రమాదకరంగా ఉన్న గుంత

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని వివిధ గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైప్‌లైన్‌ల కోసం ఏర్పాటు చేసిన కట్‌వాల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. భూమి నుంచి సుమారు మీటరు లోతులో ఏర్పాటు చేసిన కట్‌వాల్‌కు రక్షణగా చుట్టూ గోడ ఏర్పాటు చేసినా.. పై కప్పును వేయడం మరిచారు. కొన్ని చోట్ల పైకప్పులు మట్టిలో కూరుకుపోతున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో కట్‌వాల్‌పై బిగించాల్సిన పైకప్పు బిల్లలు మట్టిలో కూరుకపోయాయి. దీంతో మూత తెరిచి ఉన్న గుంతతో రోడ్డు వెంట నడిచే ఎవరైన ప్రమాదం బారినపడే అవకాశాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న గుంతలపై పైకప్పులు బిగించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



చిన్నశంకరంపేట(మెదక్): సూరారం జెడ్పీపాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



శివ్వంపేట(నర్సాపూర్): బిజ్లిపూర్ యుపీఎస్ పాఠశాలలో ..



కొల్చారం(నర్సాపూర్): చిన్నఘనాపూర్ ఉన్నత పాఠశాలలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం జెడ్పీపాఠశాల విద్యార్థులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎంగా వై.కీర్తన, ఎంఈఓగా మహేందర్, డీఈఓగా రాకేశ్, కలెక్టర్‌గా మహ్మద్ అబేదుల్ల, ఉపాధ్యాయులుగా అర్చన, మౌనిక, అఖిల, వందన, సాయికృష్ణ, నవీన్‌కుమార్, అనిత, శైలజ, యశ్వంత్, మహేశ్, అజయ్‌గౌడ్, వ్యాయమ ఉపాధ్యాయులుగా భిక్షపతి, వినోద్, అటేండర్‌గా అమూల్య వ్యవహరించారు. ఈ సందర్భంగా జెడ్పీ పాఠశాల హెచ్ఎం సాయిరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని బిజ్లిపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం స్వయం పాలన దినోత్సవం జరుపుకొన్నారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. డీఈఓగా వైష్ణవి, ఎంఈఓగా అక్షిత, కాంప్లెక్స్ హెచ్ఎంగా పౌర్ణమి, పాఠశాల హెచ్ఎం నవ్యశ్రీ, సీఆర్పీగా అఖిల్, ఉపాధ్యాయులుగా సంజన, కావ్య, అసిఫ్, గాయత్రి, నందిని, నిహారిక, విశాల్ వ్యవహరించారు. బోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు హెచ్ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్నఘనాపూర్ ఉన్నత పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతారాములు, రమణ, సంగయ్య, సిద్ధిరాములు, మహేశ్, జరీనా పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పరామర్శ



పాపన్నపేట(మెదక్): అల్లాదుర్గం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి మంగళవారం బాచారంలో పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం చేశారు.

◆ ఆహ్వానం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ధరిపల్లి గ్రామంలో ఈ నెల 22న జరిగే నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనకు రావాలని గ్రామస్తులు మైనంపల్లి హన్మంతరావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ సిద్ధిరామ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సిద్ధిరామ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రవీణ్, సురేశ్ ఉన్నారు.

◆ పెంచిన కరువుభత్యం అందించండి

చేగుంట(తూప్రాన్): బీడీ కార్మికులకు పెంచిన కరువుభత్యం అందించాలని హిందూ మజ్దూర్ సభ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం చేగుంటలో ఆయన మాట్లాడుతూ.. బీడీలు చుట్టే కార్మికులకు వెయ్యి బీడీలకు 11 రూపాయల 30 పైసలు ఏప్రిల్ నుంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. బీడీ ప్యాకర్‌లకు సైతం కరువు భత్యం లెక్కకట్టి అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు మధు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

◆ మోడల్ స్కూల్‌లో బోరు మంజూరు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ మోడల్ స్కూల్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మంగళవారం విద్యార్థుల సౌకర్యార్థం బోరు వేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్ భూమిపూజ చేసి బోరును ప్రారంభించారు. ఇందులో పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

◆ టెండర్లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయం వద్ద వివిధ టెండర్లు నిర్వహించారు. మంగళవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కొబ్బరికాయలు, దుకాణాలు, టెంట్ సామగ్రి, పార్కింగ్ కోసం టెండర్లు వేశారు. వీటి ద్వారా ఆలయానికి గత ఏడాది రూ 55.60లక్షల ఆదాయం రాగా, ఈసారి రూ 52.60లక్షలు వచ్చింది. ఆర్ఐ శ్రీహరి, ఏఎస్ఐ విఠల్, జూనియర్ అసిస్టెంట్లు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్లు గోపాల్‌రెడ్డి, మల్లేశం, మాజీ సర్పంచ్‌లు సాయిలు, సాయాగౌడ్, మాజీ ఉపసర్పంచ్‌లు మానిక్యరెడ్డి, శేఖర్, నాయకులు మానిక్యరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవం

హవేళీఘణాపూర్(మెదక్): మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం జరుగుతోంది. ఈ సందర్భంగా ఉత్సవాలకు మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గౌడ సంఘం సిద్ధగిరిగౌడ్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ బహుమతులు అందజేత



చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని మోడల్ పాఠశాలలో సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు మంగళవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా 9వ, 10వ తరగతి విద్యార్థులు ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఇటీవల పాఠశాలలో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

◆ నీటి సమస్య పరిష్కారం

మెదక్: పట్టణంలోని 20వ వార్డులో నీటి సమస్య పరిష్కరించేందుకు మైనంపల్లి సేవా సంస్థ ఆధ్వర్యంలో బోరు వేశారు. కార్యక్రమంలో రమేశ్, దయాసాగర్, సాయికుమార్, వంశీ రంజిత్, రమేశ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

◆ రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

చేగుంట(తూప్రాన్): ట్రావెల్ బస్సుతో పాటు ప్యాసింజర్ ఆటో, ట్రాక్టర్ ఒకేదారిలో వెళ్తూ ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన మండల కేంద్రం మాసాయిపేటలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌ఘడ్‌కు చెందిన ట్రావెల్ బస్సు, ప్యాసింజర్ ఆటోతో పాటు ట్రాక్టర్ కామారెడ్డి వైపుకు ఒకే దారిలో వెళ్తున్నాయి. ఈక్రమంలో ఓవర్‌టేక్ చేయబోతున్న బస్సుకు ట్రాక్టర్ అడ్డురాగా బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తాపడగా ఆటో బస్సుకు తగిలి ఆగిపోయింది. ట్రాక్టర్ డ్రైవర్ భిక్షపతి, ఆటోలో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.